# ప్రగతి బాటలో ప్రభుత్వ బడులు



మన ఊరు-మన బడితో సుందరంగా మారిన గౌతాపూర్ ప్రభుత్వ పాఠశాల

- సర్కారు పాఠశాలల్లో మెరుగు పడుతున్న మౌలిక సదుపాయాలు
- సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రతి ఏటా పెరుగుతున్న అడ్మిషన్లు

తాండూరు, అక్టోబర్ 12: కార్పొరేటు, ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా తెలంగాణ సర్కారు ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో ప్రభుత్వ విద్యా సంస్థలు ఒక్కో మెట్టు ఎక్కుతూ విజయం వైపు దూసుకెళ్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ఎక్కడికో తీసుకెళ్తామని అప్పటి సర్కారు ఊదరగొట్టినా ఫలితం లేకపోయింది. ఆ హామీలన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి రాష్ట్ర పాలకులు కనీస అవసరాలు తీర్చడంలోనూ విఫలమయ్యారు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు గండాల నుంచి గట్టెక్కుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసిస్తున్న పేదవర్గాలకు తెలంగాణ ప్రభుత్వం బంగారు బాటను చూపుతున్నది. సర్కారు స్కూల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడంతో పాటు సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉదయం టిఫిన్ అన్ని హంగులతో కూడిన గుణాత్మక విద్యను అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను సకాలంలో అందిస్తున్నది. దశలవారీగా డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ఎంతగానో మేలు చేస్తున్నది. ప్రత్యేక నిధులతో పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీళ్ల ఏర్పాటుతో పాటు అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలవైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

**ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు క్యూ...**

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు, ఉచిత బోధన, పాఠ్యపుస్తకాల పంపిణీ, సన్నబియ్యంతో కూడిన భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం ప్రారంభించడంతో పాటు పూర్తి అర్హత కలిగిన ఉపాధ్యాయ బృందం ఉండడంతో వేలకు వేలు ఫీజులు తీసుకునే ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో పలు ప్రైవేటు పాఠశాలల్లోంచి ఈ ఏడాది తాండూరు పట్టణంలోని ప్రభుత్వ నంబర్-1, నంబర్-2 పాఠశాలలతో పాటు మల్‌రెడ్డిపల్లి, అగ్గనూరు యాలాల ప్రభుత్వ బడుల అడ్మిషన్లకు క్యూ కట్టారు. ముందెన్నడూ లేని విధంగా తాండూరు నియోజకవర్గంలో 24,862 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు విద్యాధికారులు తెలిపారు. వేల ఫీజులు కట్టే ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, విద్యాబోధన బాగుండడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో వేస్తున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయడంతో ప్రభుత్వ విద్యా సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చేర్పిస్తున్నారు. అందుకు తగ్గట్లు స్థానిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు.



### సకాలంలో పుస్తకాలు, యునిఫాం ఇచ్చాం



తాండూరు పట్టణంతో పాటు మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మీడియంలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు యూనిఫాం అందజేశాం. ప్రభుత్వ పాఠశాలలో మురుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యంతో పాటు చక్కటి క్రీడా మైదానాలు అందుబాటులో ఉన్నాయి. మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల శుభ్రతకు ప్రత్యేక నిధులు వస్తున్నాయి.

**- వెంకటయ్యగౌడ్, ఎంఈవో, తాండూరు, పెద్దేముల్**

### అడ్మిషన్లు పెరుగుతున్నాయి



సకల సౌకర్యాలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా సర్కారు బడులు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకాన్ని ప్రవేశపెట్టి నిధులను మంజూరు చేస్తున్నది. మౌలిక సదుపాయాలు కల్పించడంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. మధ్యాహ్న బోజనంతో పాటు అల్పాహారం కూడా అందించడం మాకు చాలా సంతోషంగా ఉన్నది.

**- సుధాకర్‌రెడ్డి, ఎంఈవో బషీరాబాద్, యాలాల**

## ఆడుతూ.. పాడుతూ బతుకమ్మ సంబురాలు



పెద్దేముల్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న పాఠశాల విద్యార్థినులు

తాండూరు రూరల్, అక్టోబరు 12 : మండలంలోని కరణ్‌కోట పాఠశాలలో గురువారం బతుకమ్మ పండుగను విద్యార్థినులు వైభవంగా నిర్వహించారు. ఆటపాటలతో పాఠశాల ఆవరణలో చిన్నలు, పెద్దలు అనే తేడాలేకుండా బతుకమ్మ ఆడుతూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

**పెద్దేముల్ :** మండల పరిధిలో ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థినులు, చిన్నారులు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. తరగతుల వారీగా విద్యార్థినులు వివిధ రకాల ఆకులు, పువ్వులతో బతుకమ్మలను తయారు చేశారు. వీరికి మహిళా ఉపాధ్యాయులు సహకరించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో పేర్చి పాటలు పాడి.. ఆటలు ఆడారు. పాఠశాలలకు దసరా సెలవులు నేటి నుంచి ప్రారంభం కానున్న తరుణంలో చివరి రోజు బతుకమ్మ సంబురాలతో పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది



తాండూరు రూరల్ : కరణ్‌కోట పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**కులకచర్ల :** మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్‌లో గురువారం ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, అక్టోబరు 12 : అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని అధికారులకు కేటాయించిన విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి మండలాల సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ రూట్లలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే బూత్ లెవల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పోలింగ్ స్టేషన్లలో చేపట్టాల్సిన సౌకర్యాలు, నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లు విజయ్‌కుమార్, వెంకటేశ్, సెక్టోరియల్ అధికారులు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## రాడార్ కేంద్రం ఏర్పాటును రద్దు చేయాలి

పూడూరు, అక్టోబర్ 12 : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నేవీ సిగ్నల్ రాడార్ కేంద్రం ఏర్పాట్లను వెంటనే రద్దు చేయాలని పూడూరు మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సత్యనంద్‌స్వామి, ఉప సర్పంచ్ టి.రాజేందర్, రిటైర్డ్ హెచ్‌ఎం నర్సింహులు, తాజొద్దీన్ పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ రాడార్ కేంద్రం ఏర్పాటుతో పురాతనమైన ఆలయాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. అలాగే స్థానికులకు ఎలాంటి లాభం లేకపోవడంతో పాటు సుమారు 10 లక్షలకు పైగా చెట్లను నరికివేస్తారని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకపోయినా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

దోమ, అక్టోబర్ 13 : ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దోమ ఎస్సై రవిగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లలో వ్యక్తులు, సంఘాలు, పార్టీలను రెచ్చగొట్టేలా, కించపరిచేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు పెడితే ఆయా గ్రూపుల్లో నుంచి అడ్మిన్‌లు వారిని తొలగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెద్దేముల్, అక్టోబర్ 12 : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్సై కాశీనాథ్ తెలిపారు. మండల పరిధిలోని మారేపల్లిలోని భీమ్ రెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అనంతరం ఈ ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

**నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్**

మండలంలోని బండమీదిపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామని ఎస్సై కాశీనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన బత్తిలి నరేశ్, రవి, పట్లూర్ శేఖర్, కాస ఎల్లప్ప పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని, వారి నుంచి రూ.1,840 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు నిందితులను కోర్టులో హాజరు పర్చామని తెలిపారు.

**కేసులు నమోదు చేస్తాం**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఎస్సై ఎం.కాశీనాథ్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని ఆత్కూర్‌లో పరమటి రాజు కిరాణా షాపుపై దాడి చేసి షాపులో నిల్వ ఉన్న 108 బాటిళ్లను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జగన్, సిబ్బంది ఉన్నారు.



మద్యం సీసాలను చూయిస్తున్న ఎస్సై కాశీనాథ్